డాక్టర్ల రక్షణకు పటిష్ట చట్టం చేయాలి

కవాడిగూడ: విధుల్లో ఉన్న డాక్టర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శంకర్, డాక్టర్ సురేంద్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం ట్యాంక్‌బండ్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద కోల్‌కతా మహిళా డాక్టర్ హత్యకు నిరసనగా భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నా వాటిని పటిష్టంగా అమలు చేయకపోవడంతో దేశవ్యాప్తంగా ప్రతినిత్యం వారిపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. మహిళా డాక్టర్ హత్య పట్ల రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గుండు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ రష్మీ, డాక్టర్ లక్ష్మీప్రసన్నతో పాటు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాపన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఈ వేడుకల్లో బీసీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజనులందరు రాజ్యాధికారం కోసం కృషి చేయాలన్నారు. అందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న సేవా పురస్కారాల ప్రదానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని లోహియా భవన్‌లో శనివారం గౌడ ఐక్య సాధన సమితి, సర్వాయి పాపన్న జయంతి ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న సేవా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న దొమెటి వెంకటేష్ ప్రజాపతి, గడిగే శ్రీహరి, హరిత్ రూడా తదితరులను పురస్కారంతో సత్కరించారు. అనంతరం గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ.. పాపన్న ఉద్యమ స్ఫూర్తితో బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సినీహీరో జైహింద్‌గౌడ్, భిక్షపతి, జగదీష్‌యాదవ్, గంగాధర్, దన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద 77 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.17.30 లక్షలను శనివారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గం అభివృద్ధితో పాటు ప్రజల అభ్యున్నతికి తన వంతు చేయుతనిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పథకాలతో పాటు అవసరమైతే తన వ్యక్తిగతంగా పేదలకు ఆపన్నహస్తం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బొజ్జా తారకం వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాంబయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా ఉద్యమ నాయకుడు, హక్కుల నేత బొజ్జా తారకం 8వ వర్ధంతి సభను సెప్టెంబర్ 16న నిర్వహిస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(బి) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబుతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బొజ్జ తారకం చేసిన కృషిని మరువలేమన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే వర్ధంతి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బస్తీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి: బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పావని అన్నారు. శనివారం సాయంత్రం అరుంధతినగర్‌లో జీహెచ్ఎంసీ జలమండలి అధికారులతో కలసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలా ప్రహరీతో వరదనీరు నిలుస్తోందని ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అబ్దుల్ సలామ్, కృష్ణమోహన్, భాస్కర్, నాయకులు వినయ్‌కుమార్, శ్రీకాంత్, నర్సింగ్ రావు, ఉమేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



అంబర్‌పేట: ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జె.నర్సయ్యకు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వెంకట్‌రెడ్డి, వెంకటరమణ రాజు, మహేశ్ యాదవ్, సంజీవ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని బస్తీలలో కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో స్థానికుల నుంచి కార్పొరేటర్ అమృతకు వెల్లువెత్తాయి. ఈ మేరకు ఆమె శనివారం డివిజన్ పరిధిలోని రత్నానగర్, సత్యానగర్ బస్తీలలో జీహెచ్ఎంసీ, జలమండలి సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నాలాలు, డ్రైనేజీ పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

వైద్యాగ్రహం

కోల్‌కతా ఆర్‌జీ కార్ ఆస్పత్రి ఘటనపై నిరసన జ్వాలలు!

- ఐఎంఏ పిలుపు మేరకు వైద్యులు, సిబ్బంది భారీ ర్యాలీలు
- అత్యవసర వైద్య సేవలను బహిష్కరించిన వైద్యులు
- ఆస్పత్రులను సేఫ్ జోన్లుగా ప్రకటించాలని డిమాండ్
- ఆస్పత్రుల్లో ఇబ్బందులు ఎదుర్కొన్న ఓపీ రోగులు

నల్లకుంట: దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని.. అప్పుడే వైద్యులు ఎలాంటి భయాలు లేకుండా పనిచేసుకోగలుగుతారని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. కోల్‌కతా ఆర్‌జీ కార్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) శనివారం దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా శనివారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, జూనియర్ వైద్యులు అత్యవసర వైద్య సేవలను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలియజేశారు. దీంతో అత్యవసర సాధారణ వైద్య సేవలు నిలిచిపోయాయి. కేవలం ఎమర్జెన్సీ ఓపీలో కుక్క కాటు బాధితులకు మాత్రమే చికిత్సలు అందించారు.

దాడులను నిరోధించడానికి చట్టాలు ఉన్నా..

◆ ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. విమానాశ్రయాల్లో మాదిరిగానే ప్రధాన ఆస్పత్రులను కూడా సేఫ్ జోన్లుగా ప్రకటించాలన్నారు. విమానాశ్రయాల్లో సిబ్బందికి మూడంచెల భద్రత ఉంటుందని, కనీసం ప్రధాన ఆస్పత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అప్పుడే వైద్యులు, సిబ్బందికి భద్రత ఏర్పడుతుందన్నారు. వైద్యులు, ఆస్పత్రులపై దాడులను నిరోధించడానికి కేంద్ర చట్టాలు ఎంతైనా అవసరమన్నారు. 25 రాష్ట్రాల్లో వైద్యులు, ఆస్పత్రులపై దాడులను నిరోధించడానికి చట్టాలు ఉన్నా నిందితులకు ఇప్పటి వరకు శిక్షలు పడలేదని వాపోయారు. రాష్ట్ర చట్టాలు వైద్య సిబ్బందిపై దాడులను నిరోధించలేకపోయన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి, డీసీహెచ్ డాక్టర్ జయ, మేట్రిన్ విజయ, జూనియర్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయికృష్ణ ఆస్పత్రి వైద్యుల మౌన ప్రదర్శన

కాచిగూడ: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఐఎంఏ పిలుపు మేరకు శనివారం కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో వైద్య, ఆరోగ్య సేవలను నిలిపివేశారు. అత్యవసర సేవలు మినహా అన్ని ఆరోగ్య సేవలు, సాధారణ ఓపీడీలు, శస్త్ర చికిత్సలు శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు నిలిపేస్తున్నట్లు హాస్పటల్ ఎండీ డాక్టర్ రాంరెడ్డి తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి వద్ద మౌన నిరసన ప్రదర్శన చేపట్టారు. డాక్టర్ చంద్రకాంత్ తాప్సీ, డా. శ్రీధర్, డా. శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి

ముషీరాబాద్: కోల్‌కతాలో వైద్యురాలిని హత్యాచారం చేసిన దుండగులను ఉరి తీయాలని కఠిన శిక్ష విధించాలని పీఆర్‌ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ డా.సుచరితారెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం రాత్రి జీజీ చారిటీ, 9 స్టార్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో రామ్‌నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి రాంనగర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మరోసారి ఇలాంటి ఘటనలు మళ్లీ చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి వద్ద మౌన ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



నిరసనలో పాల్గొన్న పీఆర్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు



ఫీవర్ ఆవరణలో నిరసన తెలుపుతున్న సీఎస్ ఆర్‌ఎంవో డా.జయలక్ష్మి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది

దుండగులను కఠినంగా శిక్షించాలి: పీడీఎస్‌యూ

ముషీరాబాద్: పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జాతీయ కార్యవర్గ సభ్యులు మామిడికాయ పరశురాం డిమాండ్ చేశారు. కోల్‌కత్త ఆర్‌జీఆర్ మెడికల్ కాలేజీయ పీజీ విద్యార్థినిపై ఆస్పత్రి సెమినార్ హాల్‌లో కొంత మంది దుండగులు బలవంతంగా అత్యాచారం చేసి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ మేరకు విద్యానగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుల, మత కోణంలో కాకుండా పూర్తిస్థాయిలో సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో విచారణ జరిపి దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. దేశవ్యాప్తంగా విచ్చలవిడిగా మెడికల్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్న కేంద్రం వాటిలో కనీస ప్రమాణాలు, వసతులు ఉన్నాయనా లేవా తనిఖీలు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి వాటిపై తక్షణం దృష్టి సారించి వైద్య విద్యార్థుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

దుర్గాబాయి నుంచి ఓయూ వరకు భారీ ర్యాలీ



భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు

నల్లకుంట: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా వైద్యులకు రక్షణ కరువైందని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో జరిగిన ఘటనే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి(డీడీహెచ్) వైద్యులు, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. డీడీహెచ్ నుంచి ఓయూ ఎన్‌సీసీ గేట్ వరకు అక్కడి నుంచి డీడీహెచ్ వరకు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. డీడీహెచ్ ఆర్థోపెడిక్ వైద్యుడు గురుప్రసాద్, నాగేశ్వర్, శివ, గౌతం, చైతన్య, అలీమ్, సాయి మాట్లాడుతూ.. ప్రాణాపాయంలో ఉన్న రోగులకు నాణ్యమైన సేవలు అందించి పునర్జన్మను ప్రసాదించే వైద్యులపై దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా దాడులు అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు చేయడం లేదని వాపోయారు.

బీసీ కులాలన్నీ ఏకం కావాలి

సినీ హీరో జైహింద్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సర్దార్ సర్వాయి పాపన్న సినిమా హీరో జైహింద్‌గౌడ్ హాజరై మాట్లాడారు. పాపన్నగౌడ్ స్ఫూర్తితో బీసీ కులాలన్నీ ఏకమై రాజ్యాన్ని ఏలాలని పిలుపునిచ్చారు. బీసీ సామాజికవర్గాలంతా ఓట్లు వేసే యంత్రాలుగా.. జెండాలు మోసే వారిగా మిగిలిపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడతల బాలకృష్ణగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షుడు గందమల ఆనంద్‌గౌడ్, లీగల్ అడ్వైజర్ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, అంజిగౌడ్, హిమగిరిగౌడ్, నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



పాపన్న జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న సినీహీరో జైహింద్‌గౌడ్

కార్మికులకు షిఫ్టింగ్ ఇంక్రిమెంట్‌లు అమలు చేయాలి



వీఎస్‌టీ యూనియన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్‌టీ కార్మికులకు కంపెనీ షిఫ్టింగ్ ఇంక్రిమెంట్‌లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం యూనియన్ కార్యాలయం వద్ద ఐఎన్‌టీయూసీ విభాగం కార్మికులకు నిరసన వ్యక్తం చేశారు. వీఎస్‌టీ కంపెనీ ఆజామ్‌బాద్ నుంచి తూప్రాన్‌కు షిఫ్ట్ అయిన నేపథ్యంలో కార్మికులకు ఎనిమిది షిఫ్టింగ్ ఇంక్రిమెంట్‌లు, నెలకు రూ.8వేల అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ కార్మిక విభాగం జి.సంజీవరెడ్డి గ్రూప్ కార్మికులు కె.రాజు, ఎల్‌డీ పాల్, నాగేష్, ఏఆర్ శ్రీనివాస్, సుందర్, సమద్, కరుణగౌడ్, కె.ప్రభాకర్, నవీన్, శ్యామ్‌సుందర్, జానకీరామ్‌రెడ్డి మాట్లాడారు. యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందారన్నారు. తమ డిమాండ్లను అక్టోబర్ 2లోపు పరిష్కరించాలని లేనిపక్షంలో దసరా పూజలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

చర్చలకు రాకుండా ఆరోపణలు చేయడం తగదు...

◆ చర్చలకు రాకుండా ఆరోపణలు చేయడం ఐఎన్‌టీయూసీ నాయకులకు తగదని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నాయకులు హరిసెల్వస్టన్ బాబీ, రవీందర్‌యాదవ్, నరేందర్‌గౌడ్, రాములులు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై చర్చించడానికి యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. కార్మికులకు తూప్రాన్ కంపెనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యంతో చర్చిస్తున్నామని తెలిపారు. త్వరలో ఇంక్రిమెంట్స్, అలవెన్స్‌లు, అగ్రిమెట్లు తదితర సమస్యలు పరిష్కరిస్తామని వారు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణపై అవగాహన ర్యాలీ

ముషీరాబాద్: టెక్ మహీంద్ర ఫౌండేషన్, స్మార్ట్ ఉపాధి శిక్షణ కేంద్రం అందిస్తున్న ఉచిత కోర్సులపై శనివారం ప్రచారం నిర్వహించారు. బాపూజీనగర్, మేథర బస్తీ, జెమిని కాలనీ, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ఆసక్తి ఉన్న వారి పేర్లను నమోదు చేసుకున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, ఆంగ్లంలో మాట్లాడే నేర్పు, టైపింగ్‌లో స్పీడు, ఇంటర్‌నెట్ వాడకం గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు అప్సా వృత్తి శిక్షణ కేంద్రం మెనేజర్ షేఫక్ మౌలానా తెలిపారు. 10వ తరగతి పాసై ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫైయిల్ అయిన 18 – 27 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. ముషీరాబాద్ చౌరస్తా గాంధీ ఆస్పత్రి ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ దగ్గర ఉన్న శిక్షణా కేంద్రంలో తరగతులు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం.84980 89786.



ముషీరాబాద్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అప్సా, టెక్ మహీంద్ర ప్రతినిధులు

కోల్‌కతా ఘటన దురదృష్టకరం

చిక్కడపల్లి: పాఠశాల స్థాయిలో సెక్స్ ఎడ్యుకేషన్‌ను తప్పనిసరి చేయాలని మానసిక వైద్యనిపుణుడు డా. హరికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కోల్‌కతాలో ఇటీవల వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై శనివారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటన అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు భద్రత కల్పించాలని ప్రొగ్రెసివ్ సైకాలిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ ప్రభుత్వాన్ని కోరారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జక్కయ్య



కాచిగూడ: హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.జక్కయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ లసోసియేషన్ అధ్యక్షుడిగా జక్కయ్య వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జక్కయ్యను కాచిగూడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతాలు గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

గుర్తుతెలియని మహిళ మృతి

కాచిగూడ: కాచిగూడ – విద్యానగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఈనెల 15న గుర్తుతెలియని మహిళ పట్టాలపై గాయాలతో పడి ఉండటంతో కాచిగూడ రైల్వే పోలీసులు ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం ఆ మహిళ మృతి చెందినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

నల్లకుంట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నల్లకుంట అడ్మిన్ ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వాచ్‌మెన్‌గా పని చేస్తున్న కొల్లపు రాజయ్య(68) కుటుంబీకులతో కలిసి విద్యానగర్‌లోని జ్ఞాని కాంప్లెక్స్‌లో నివాసముంటున్నాడు. ఈనెల 15న రాత్రి 10.30గంటల సమయంలో రాజయ్య ఏఆర్‌ఐసీ వసుంధర కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా విప్పుల శ్రీతేజ(20) అనే విద్యార్థి తన కారుతో ఢీ కొట్టాడు. దీంతో రాజయ్య ఎడమ కాలు, పాదం, తలకు తీవ్ర గాయాలు కావడంతో అదే కారులో సమీపంలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఈనెల 16న గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శనివారం తెల్లవారుజామున 2గంటల సమయంలో రాజయ్య మృతి చెందాడు. నిర్లక్ష్యంగా కారును నడిపిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు సునిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ గణేష్‌నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి హరిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేష్‌నగర్, రాంనగర్, లలితా నగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు నేత శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఆలయ నిర్వాహకులు

బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాన్ని ఖండించండి

బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్. శ్రీనివాస్‌రావు



ముషీరాబాద్: కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా, కొన్ని యూట్యూబ్ చానళ్లు పని కట్టుకొని విష ప్రచారానికి దిగుతున్నాయని ప్రజలు ఈ విష ప్రచారాన్ని నమ్మొద్దని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎం.ఎన్. శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి 10మంది ఎమ్మెల్యేలు వెళ్తున్నారని... ప్రతిపక్ష హోదా కూడా లేకుండా బీఆర్ఎస్ కుదేలవుతుందని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అదే విధంగా బీఆర్ఎస్ భారతీయ జనతా పార్టీలో విలీనం అవుతుందంటూ మరో అసత్య ప్రచారానికి తెరలేపారని అన్నారు. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు ప్రత్యేక సుమారు 50 లక్షలపైగా సభ్యత్వం కలిగి ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయని ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రానా కుప్పకూలుతుందని అనుకోవడం వారి అజ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. అంతేకాకుండా కేసీఆర్, కేటీఆర్, హరీష్ లాంటి నాయకులను తట్టుకునే శక్తి ఏ పార్టీకి లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిచే పార్టీ బీఆర్ఎస్‌యే అని ప్రజలే అంటున్నారని అన్నారు. ఇది ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకతను తెలియజేస్తోందని అన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందూవులపై దాడులను అరికట్టాలి

కాచిగూడ: బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మున్నూరుకాపు మహాసభ అధ్వర్యంలో శనివారం రాత్రి కాచిగూడలో కోవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా హిందూవులందరూ సంఘటితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దామేర జ్ఞానేశ్వర్, కొండూరు వినోద్ కుమార్, హనుమంతరావు, మణికొండ రమేష్ కుమార్, గోపాల రాధకృష్ణ, మించు ఆనంద్, కొంతం సురేష్, గంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో కోవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మున్నూరుకాపు మహాసభ ప్రతినిధులు